## ఆదర్శ పాఠశాలల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మంచాల, జనవరి 31: మండల పరిధిలోని ఆరుట్ల ఆదర్శ పాఠశాలలోని ప్రవేశాల కోసం విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సుప్రియ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఆరుట్ల పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. 2025-26 విద్యా సంవత్సరానికి గాను 6నుంచి 10వ తరగతి అడ్మిషన్ల కొరకు జనవరి 6వ తేదీ నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఆరవ తరగతిలో 100సీట్లు, 7వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయనున్నట్లు చెప్పారు. ప్రభుత్వం సూచించిన వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

## నూతన దంపతులకు మాజీ ఎమ్మెల్యే ఆశీర్వాదం



కొందుర్గు, జనవరి 31: నూతన దంపతులను షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఆశీర్వదించారు. కొందుర్గు పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న శివదత్త వివాహ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ రాజేశ్‌పటేల్, మాజీ సర్పంచ్ బంధులాల్, నాయకులు విజయ్‌కుమార్, పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతపై అవగాహన అవసరం

**ఆర్టీవో సుభాశ్‌రెడ్డి చంద్రారెడ్డి**

తుర్కయాంజాల్, జనవరి 31: రోడ్డు భద్రతపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఇబ్రహీంపట్నం ఆర్టీవో సుభాశ్‌రెడ్డి చంద్రారెడ్డి అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మన్నెగూడ ఆర్టీఏ కార్యాలయం నుంచి సాగర్ కాంప్లెక్స్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించిన సుభాష్ చంద్రారెడ్డి మాట్లాడుతూ రోడ్డు భద్రతపై పౌరులు మరింత దృష్టి సారించాలని సూచించారు. ముఖ్యంగా బైక్‌ను నడిపేవారు హెల్మెట్, కారును నడిపేవారు సీటు బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని అన్నారు. రోడ్డు భద్రత నియమాలను పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో ఏవీఐలు సుషిల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మున్ని, అనూష, రాఘవులు, ఏవో ప్రసాద్ పాల్గొన్నారు.



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న ఆర్టీవో సుభాశ్ చంద్రారెడ్డి

## ఎస్సీలను వర్గీకరించాలి



షాబాద్, జనవరి 31: సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణను అమలు చేసేదాకా పోరాటం కొనసాగిస్తామని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు మద్దిలేటి మాదిగ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శంకర్‌రావు మాదిగ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని రుద్రారం గ్రామంలో ఎమ్మార్పీఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా దయాకర్, ఉపాధ్యక్షుడిగా రవీందర్, అధికార ప్రతినిధిగా ప్రశాంత్, ప్రధాన కార్యదర్శిగా జైపాల్, కార్యదర్శిగా వినయ్‌కుమార్, ప్రచార కార్యదర్శిగా వేణు, కోశాధికారిగా శివకుమార్, సలహాదారులుగా సుదర్శన్, భరత్‌కుమార్, చంద్రశేఖర్, వెంకటస్వామి, ప్రభాకర్, శ్రీనివాస్, రవీందర్ తదితరులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జాతీయ నాయకుడు మద్దిలేటి మాదిగ, శంకర్‌రావు మాదిగ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ అమలుకు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 7వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించే లక్ష డప్పులు, వేల గొంతుల సాంస్కృతిక మహా ప్రదర్శనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు చంద్రశేఖర్, రామకృష్ణ, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

## రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి



మొయినాబాద్‌లోని పెద్దమంగళారం-చందానగర్ రోడ్డును పరిశీలించి నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

మొయినాబాద్, జనవరి 31 : ధ్వంసమైన రోడ్లలో మరమ్మతులు చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కె రామస్వామి ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం మండల పరిధిలోని పెద్దమంగళారం-చందానగర్ రోడ్డు గుంతలమయం కావడంతో సీపీఐ నాయకులు రోడ్లను పరిశీలించి, నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్ల మీద ప్రయాణించాలంటే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. సంబంధిత ఆర్అండ్‌బీ అధికారులు, పంచాయతీ రాజ్‌శాఖ అధికారులు వెంటనే రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కె శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.



షాద్‌నగర్ మున్సిపల్ కమిషనర్ సునీతారెడ్డిని సన్మానిస్తున్న అధికారులు, సిబ్బంది



మొయినాబాద్‌లో బాధ్యతలు చేపట్టిన మున్సిపల్ కమిషనర్ ఖాజామొయిజుద్దీన్

## మున్సిపల్ కమిషనర్ల బాధ్యతల స్వీకరణ

షాద్‌నగర్‌టౌన్, జనవరి 31: షాద్‌నగర్ మున్సిపల్ కమిషనర్‌గా సునీతారెడ్డి శుక్రవారం పదవీబాధ్యతలు చేపట్టారు. నారాయణపేట్ మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహించిన సునీతారెడ్డి బదిలీపై షాద్‌నగర్‌కు వచ్చారు. షాద్‌నగర్ మున్సిపాలిటీ అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానన్నారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో చేపట్టే అభివృద్ధి పనుల్లో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. రెండు సంవత్సరాలకు పైగా షాద్‌నగర్ మున్సిపల్ కమిషనర్‌గా పదవీబాధ్యతలు నిర్వహించిన చీమ వెంకన్న తెలంగాణ సచివాలయానికి బదిలీ అయ్యారు. నూతన మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన సునీతారెడ్డిని అధికారులు, సిబ్బంది సన్మానించారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ మోయిన్‌బాబా, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ సాయిబాబా సిబ్బంది పాల్గొన్నారు.

**మొయినాబాద్ కమిషనర్‌గా ఖాజామొయిజుద్దీన్**

మొయినాబాద్ : మున్సిపాలిటీ కమిషనర్‌గా శుక్రవారం తాత్కాలిక మొయినాబాద్ మున్సిపాలిటి (మొయినాబాద్ గ్రామ పంచాయతీ) కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్‌ను మున్సిపల్ సిబ్బంది సన్మానించారు. మున్సిపల్ సిబ్బంది జమీల్, సంధ్యారాణి, వెంకయ్య, సుదర్శన్, వెంకటేశ్వర్‌రెడ్డి, వెంకటేశ్, రామకృష్ణారెడ్డి, శ్రీనివాస్ ఉన్నారు.

## దాతల కృషి అభినందనీయం

**మండల విద్యాధికారి పురందాస్**



దాతలను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

చేవెళ్లటౌన్, జనవరి 31: దాతల కృషి అభినందనీయమని మండల విద్యాధికారి పురందాస్ తెలిపారు. శిథిలావస్థలోనున్న చేవెళ్ల మండల విద్యావనరుల కేంద్రం పూర్వవైభవం కోసం సహకరించిన దాతలకు ఉపాధ్యాయులు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దాతలు చేవెళ్ల మాజీ సర్పంచ్ బండారి శైలజా ఆగిరెడ్డి, చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ దేవర సమతావెంకట్‌రెడ్డి, చేవెళ్ల గ్రామస్తుడు తిరుపతిరెడ్డి, రిటైర్డ్ ఉపాధ్యాయులు హనుమంత్‌రెడ్డి సహకారం అందించారన్నారు. భవనానికి మరమ్మతులు, పెయింటింగ్ వేయించడంతో పాటు అవసరమైన ఫర్నిచర్‌ను దాతలు సమకూర్చడం జరిగిందన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు మహమ్మద్ ఖాజా పాషా, రిటైర్డ్ ఉపాధ్యాయులు హనుమంత్‌రెడ్డి, నాయకులు ఆగిరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ టేకులపల్లి శ్రీనివాస్‌యాదవ్, మాజీ వార్డు మెంబర్ మల్గారి మల్లారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ప్రవీణ్, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల ఉపాధ్యాయ సంఘాల నాయకులు అక్బర్, మునీర్ పాషా, రాజశేఖర్, ప్రవీణ్, దయానందం, హరి, నర్సింహులు, వెంకటేశ్, రాజశేఖర్ ఉన్నారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇసుక ట్రాక్టర్

మాడ్గుల, జనవరి31: మండల పరిధిలోని నల్లచెరువు గ్రామంలో ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు శుక్రవారం పట్టుకొని, పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్ నల్లచెరువు గ్రామానికి చెందిన పర్వతాలు, అదే గ్రామానికి చెందిన ట్రాక్టర్ యజమాని మహేశ్‌గా గుర్తించారు. వారిపైన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ జగదీశ్ తెలిపారు.

## ఫిబ్రవరి 15ను సెలవుదినంగా ప్రకటించాలి

కేశంపేట, జనవరి 31: గిరిజనుల ఆరాధ్య దైవం మహారాజ్‌శ్రీ సంత్ సేవాలాల్ జయంతి ఫిబ్రవరి 15ను అధికారిక సెలవు దినంగా ప్రకటించాలని లంబాడ హక్కుల పోరాట సమితి కేశంపేట మండల అధ్యక్షుడు రాజూనాయక్ శుక్రవారం డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మహారాజ్‌శ్రీ సంత్ సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్నా అధికారిక సెలవుదినంగా ప్రకటించకపోవడం విచారకమన్నారు. ప్రభుత్వం అధికారిక సెలవుదినంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ షాద్‌నగర్ పట్టణంలోని బ్లాక్ ఆఫీస్ ఆవరణలో శనివారం ఒక్కరోజు నిర్వహించే నిరసన దీక్షకు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్‌నాయక్ రానున్నట్లు తెలిపారు.

## హమాలీల సమస్యలు పరిష్కరిస్తాం

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 31 : బాటసింగారంలోని గడ్డిఅన్నారం వ్యవసాయ పండ్ల మార్కెట్ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి, వైస్ చైర్మన్ చౌదరిమెట్టు భాస్కర్‌చారిని హమాలీ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ముత్యాల యాదిరెడ్డి శుక్రవారం కలిసి హమాలీల సమస్యలపై చర్చించారు. వాహనాల నుంచి పండ్లను దించడం, ఎక్కించడం, యూనిఫాం, లైసెన్స్ తదితర అంశాలపై ప్రస్తావించినట్లు వారు తెలిపారు. ఈ విషయం పై చైర్మన్ సానుకూలంగా స్పందించి హమాలీ కార్మికులకు అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సమావేశంలో మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి శ్రీనివాస్, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు అజ్మీర హరిసింగ్‌నాయక్, జిల్లా కార్యవర్గసభ్యుడు కేతరాజు నర్సింహ, సైదులు ముదిరాజ్, మార్కెట్ యూనియన్ అధ్యక్షుడు షరీఫ్, ప్రధానకార్యదర్శి చిన్నగౌడ్, కోశాధికారి పోచయ్య, కార్మికులు రాములన్న, శంకర్‌నాయక్, మున్న, కృష్ణ, రాజా, ముస్తఫా, చంద్రశేఖర్, అంజాద్‌ఖాన్, తిప్పన్న పాల్గొన్నారు.

## ఆయుష్‌ను సందర్శించిన ఒడిశా విద్యార్థులు



ఆయుష్ సంస్థను సందర్శించిన ఒడిశా హోమియోపతిక్ వైద్య కళాశాల విద్యార్థులు

సైదాబాద్, జనవరి 31 : సైదాబాద్ డివిజన్ పరిధిలోని గడ్డి అన్నారంలోని జాతీయ భారతీయ వైద్య పరంపర (ఆయుష్) సంస్థను శుక్రవారం ఒడిశా భువనేశ్వర్ డాక్టర్ అభిన చంద్ర హోమియోపతిక్ మెడికల్ కాలేజ్-హాస్పిటల్‌కు చెందిన 4వ సంవత్సరం బీహెచ్‌ఎంఎస్ చదువుతున్న వైద్య విద్యార్థులు సందర్శించారు. ప్రొఫెసర్ డాక్టర్ ప్రియా సత్పతి, డాక్టర్ దేబాస్మిత దాస్ పర్యవేక్షణలో 4వ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఆయూష్‌కు వచ్చి పలు అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సంస్థ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ జి.పి. ప్రసాద్ విద్యార్థులకు సంస్థ పనితీరును, గ్రంథాలయంలోని పురాతన, సంగ్రహాలయంలోని తాళపత్ర గ్రంథాలు, వైద్య చికిత్స చరిత్ర సంబంధించిన విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బిస్వో రంజన్ దాస్, డాక్టర్లు అష్వాక్ అహ్మద్, శ్రీదేవి, సంతోస్ మానే, మురళి మనోహర్ పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ నేతల అరెస్టు

కొందుర్గు, జనవరి 31: సీఎం పర్యటనను పురస్కరించుకొని కొందుర్గు మండలంలో ఎమ్మార్పీఎస్ నేతలను పోలీసులు అరెస్టులు చేసి స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు ఆనంద్‌మాదిగ మాట్లాడుతూ.. అక్రమ అరెస్టులతో తమ గొంతును అణిచివేయలేరన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు మంచి చేస్తే తమను అరెస్టు చేయాల్సి ఎందుకు వస్తుందని ప్రశ్నించారు. రిజర్వేషన్‌కు సంబంధించి ముఖ్యమంత్రిని కలిసేందుకు ఎమ్మార్పీఎస్ నాయకులు వెళితే తప్పేముందని, సుప్రీంకోర్టు తీర్పు తర్వాత కూడా సీఎంను కలిసి అమలు చేయమని అడిగే హక్కులేదా? అని ప్రశ్నించారు. ప్రభుత్వ తీరు మార్చుకోవాలని, పోలీసుల చేత అణిచివేయాలని చూస్తే రాబోయే రోజుల్లో తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

## అరెస్టు అప్రజాస్వామికం

కొందుర్గు, జనవరి 31: సీఎం పర్యటన సందర్భంగా బీఆర్‌ఎస్ నేతలను అరెస్టులు చేయడం అప్రజాస్వామికమని హన్మారి రాజు అన్నారు. సీఎం పర్యటను పురస్కరించుకొని ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి అనుచరులైన రాజు, గుట్ట ప్రశాంత్, ఎల్లంపల్లి సాయి, గుర్రంపల్లి ఆంజనేయులును పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించడంపట్ల ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమ అరెస్టులను సహించేదిలేని, పోలీసుల చేత అరెస్టులు చేయించి తగ గొంతును అణిచివేయలేరన్న విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. ప్రభుత్వ విధానాలను ప్రజలు గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

## ఎమ్మార్పీఎస్ నాయకుల ర్యాలీ



ర్యాలీ నిర్వహించిన నాయకులు

మాడ్గుల, జనవరి31: మండల పరిధిలోని ఇర్విన్ గ్రామంలో ఎమ్మార్పీఎస్ నాయకులు శుక్రవారం గ్రామ దండోర నాయకులు కలసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఫిబ్రవరి 7న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ అధ్యక్షతన నిర్వహించే లక్ష డప్పులు.. వెయ్యి గొంతుల కార్యక్రమానికి ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని నాయకులు కోరారు. కార్యక్రమంలోని జగన్ మాదిగ, శ్రీను, మల్లేశ్, బుచ్చయ్య, అశోక్, చంద్రయ్య, శ్రీధర్ పాల్గొన్నారు

## ఇబ్రహీంపట్నం సీఐగా జగదీశ్



సీఐగా బాధ్యతలు స్వీకరించిన జగదీశ్

ఇబ్రహీంపట్నంరూరల్, జనవరి 31 : ఇబ్రహీంపట్నం సీఐగా జగదీశ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇబ్రహీంపట్నం సీఐగా పనిచేసిన సత్యనారాయణను రాచకొండ సీపీ కమిషనర్‌రేట్‌కు రెండు నెలల క్రితం అటాచ్‌చేశారు. అప్పటి నుంచి ఖాళీగా ఉన్న ఇబ్రహీంపట్నం సీఐగా జగదీశ్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు శుక్రవారం ఇబ్రహీంపట్నం సీఐగా జగదీశ్ బాధ్యతలు స్వీకరించారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం కృషి చేస్తానని తెలిపారు.

## గుర్తుతెలియని మృతదేహం లభ్యం

ఇబ్రహీంపట్నంరూరల్, జనవరి 31 : ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలోని మంగళ్‌పల్లి సమీపంలో ఓ వెంచర్‌లో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. దీనికి సంబంధించి ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు కథనం ప్రకారం మంగళ్‌పల్లి సమీపంలోని వెంచర్‌లో శుక్రవారం మధ్యాహ్నం మృతదేహం లభ్యమైంది. మృతుడి వయస్సు 35 నుంచి 40 మధ్య ఉండవచ్చని తెలిపారు. ఈ వ్యక్తి చెరుకుపల్లి విలేజ్ దిండి మండలం నల్గొండజిల్లాలో ఎంఎస్ టైలర్‌షాప్‌లో చొక్కా కుట్టించినట్లుగా తెలుస్తోంది. అయితే, చెరుకుపల్లి డిండి ప్రాంతానికి చెందిన వాడిగా తెలుస్తోందన్నారు. మిస్సింగ్ కేసు ఉంటే ఈ 8712571489 లేదా 87126 62419 లో సంప్రదించాలన్నారు.

## వ్యక్తి అదృశ్యం



రెహమత్ అలీ (ఫైల్)

ఆదిబట్ల, జనవరి 31: నమాజ్‌కు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. శుక్రవారం ఎస్ఐ వెంకటేశ్ తెలిపిన వివరాల ప్రకారం ఈత్తారాంపూర్ గ్రామం, బైరామ్‌పూర్ జిల్లా, ఉత్తరప్రదేశ్‌కు చెందిన రెహమత్ అలీ బ్రతుకు దెరువు కోసం రావిరాలకు వచ్చారు. తన తోటి కార్మికులతో కలిసి రావిరాల ప్యాబ్‌సిటీ వద్ద సీలింగ్ వర్క్ పని చేసేవాడు. కాగా, శుక్రవారం తాను పని చేస్తున్న వద్ద నుంచి నమాజ్ చేయడానికి వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో తనకు తెలిసిన వారి వద్ద వెతికినా సమాచారం తెలియక పోవడంతో తోటి కార్మికులు ఆదిబట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని అన్నారు.

## నూతన నియామకం

ఆర్కేపురం, జనవరి 31 : జాతీయ కాపు సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా గంధం రవికేశవ నాయుడు నియమితులయ్యారు. శుక్రవారం జాతీయ కాపు సంఘం కార్యాలయంలో సంఘం వ్యవస్థాపకుడు కర్ణ మురళీకృష్ణ నాయుడు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవికేశవ నాయుడు మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లాలో కాపు సంఘం బలోపేతానికి అన్ని విధాలుగా కృషి చేస్తానని తెలిపారు.

## నల్లబెల్లం, నవసాగర్ ధ్వంసం



నల్లబెల్లం, నవసాగర్‌ను మూసీనదిలో పారబోస్తున్న ఎక్సైజ్ పోలీసు

హయత్‌నగర్, జనవరి 31 : నాలుగు వేల కిలోల నల్లబెల్లం, నవసాగర్‌ను ధ్వంసం చేసిన సంఘటన హయత్‌నగర్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. ఎస్‌హెచ్‌ఓ ధన్వంత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..సరూర్‌నగర్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రంగారెడ్డి జిల్లా డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు హయత్‌నగర్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన నాలుగు వేల కిలోల నల్లబెల్లం, నవసాగర్(ఆలం)ను గౌరెల్లి వద్ద మూసీనదిలో ధ్వంసం చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సరళ, కానిస్టేబుల్ రమేశ్, శేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

## ట్యూషన్‌కు వెళ్లి వస్తున్న విద్యార్థులపై దాడి

మలక్‌పేట, జనవరి 31: ట్యూషన్‌కు వెళ్లి తిరిగి వస్తున్న ఇద్దరు విద్యార్థులను అడ్డగించి దాడిచేసిన యువకులపై మలక్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ నవీన్ కథనం ప్రకారం యాకత్‌పురా పోస్ట్ ఆఫీసు ప్రాంతానికి చెందిన సయ్యద్ దబీర్ హుస్సేన్ ఫరాజ్, తన స్నేహితుడైన హస్నైన్‌తో కలిసి గురువారం రాత్రి 8.15 గంటలకు దిల్‌సుఖ్‌నగర్ మెట్రో స్టేషన్‌వద్ద ట్యూషన్‌కు వెళ్లి తిరిగి బైక్‌పై వస్తుండగా, ముంతాజ్ కళాశాల వద్ద అడ్డగించిన అస్గర్, అతడి స్నేహితులు దాడి చేశారు. దీంతో సయ్యద్ దబీర్ హుస్సేన్ ఫరాజ్, హస్నైన్‌లకు గాయాలవటంతో శుక్రవారం మలక్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## పేదల సొంతింటి కల సాకారం

**ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**



ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, జనవరి 31: ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం చేస్తుందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో రూ. 5లక్షలతో నిర్మించే ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణానికి శుక్రవారం పీసీబీ సభ్యుడు ఠాగూర్ బాలాజీసింగ్‌తో కలిసి భూమి పూజ చేశారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో అధికారులు పారదర్శకత పాటించాలన్నారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, ఎంపీడీవో కుసుమ మాధురి, తహసీల్దార్ లలిత, ఏపీవో మాధవరెడ్డి, నాయకులు రాములు, శ్రీశైలం, జగన్, మానయ్య, శ్రీనివాస్‌రెడ్డి, మైసయ్య, శ్రీకాంత్, ఫరీధ్జ నాజర్, మహేశ్ పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న స్పెషల్ ఆఫీసర్ కృష్ణయ్య, మాజీ సర్పంచ్

చేవెళ్ల రూరల్, జనవరి 31 : చేవెళ్ల మండల పరిధి అంతారం గ్రామంలో ఎంపీ ల్యాడ్ నిధులు రూ.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం చేవెళ్ల తహసీల్దార్, గ్రామ ప్రత్యేక అధికారి కృష్ణయ్య, మాజీ సర్పంచ్ సులోచనాఅంజన్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. సీసీ రోడ్డు నిధుల మంజూరుకు కృషి చేసిన హైదరాబాద్ బీఎస్ఎన్ఎల్ బోర్డు సభ్యుడు సామ మాణిక్యరెడ్డికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతున్నామని 2వ వార్డు ప్రజలు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఏఈ ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, మాజీ ఉప సర్పంచ్ యెల్లన్న, అంబేద్కర్ సంఘం గ్రామ అధ్యక్షుడు మణికంఠ, బీఆర్ఎస్ నాయకులు వీరాంజనేయులుగౌడ్, పాండు, వీరస్వామి, రాము, కారోబార్ రామచంద్రయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలి



షాబాద్, జనవరి 31: విద్యార్థులు సైన్స్‌పై అవగాహన పెంచుకుని, నూతన విధానంలో పరికరాలు తయారు చేయాలని షాబాద్ మండల విద్యాశాఖ అధికారి లక్ష్మణ్‌నాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో లెర్నింగ్ లింక్ ఫౌండేషన్, అమెజాన్ థింక్ బిగ్ సైన్స్ కార్నివాల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సైన్స్ కార్నివాల్‌లో వివిధ మండలాల నుంచి విద్యార్థులు పాల్గొని తయారు చేసిన సైన్స్ ఇన్నోవేటివ్ ప్రాజెక్టులను ప్రదర్శించారు. మండలంలోని ప్రభుత్వ, రెసిడెన్షియల్, మోడల్ స్కూల్ నుంచి విద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈవో లక్ష్మణ్‌నాయక్ మాట్లాడుతూ.. విద్యార్థులు నూతన పరికరాలు తయారు చేసి సైంటిస్టులుగా ఎదుగాలని సూచించారు. దీనిలో భాగంగా సైన్స్ కార్నివార్‌లో మొదటి మూడు స్థానాల్లో ఉన్న వివిధ విభాగాల నుంచి ఎంపికైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, సంస్థ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎంపీటీసీల డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 31 : అబ్దుల్లాపూర్‌మెట్ మండల ఎంపీటీసీల డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌ను పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ ద్వారా వెల్లడించింది. 2019లో జరిగిన ఎంపీటీసీ ఎన్నికల్లో మొత్తం 11 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, 2024 సెప్టెంబర్‌లో తారామతిపేట, బాచారం, గౌరెల్లి, కుత్బుల్లాపూర్ 4 గ్రామ పంచాయతీలు, తారామతిపేట, బాచారం, కుత్బుల్లాపూర్ 3 ఎంపీటీసీ స్థానాలు పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీలో విలీనం కావడంతో 8 ఎంపీటీసీ స్థానాలకు తగ్గిపోయాయి. ఈ ముసాయిదా ఎంపీటీసీ జాబితా జనవరి 30న ప్రచురించారు. జనవరి 30 నుంచి 31 వరకు రెండు రోజుల పాటు ఫిర్యాదులను స్వీకరించారు. దీంతో పాటు ఫిబ్రవరి 1, 2న అభ్యంతరాలను పరిష్కరిస్తారని అధికారులు తెలిపారు. ఫిబ్రవరి 3న తుది ప్రకటనను వెలువరించనున్నామని పేర్కొన్నారు.

## విద్యుదాఘాతంతో నెమలి మృతి



కేశంపేట, జనవరి 31: విద్యుదాఘాతంతో నెమలి మృతి చెందిన ఘటన కేశంపేట మండల కేంద్రంలోని వ్యవసాయ పొలాల్లో శుక్రవారం వెలుగు చూసింది. స్థానికుల కథనం ప్రకారం.. చౌలపల్లి వెళ్లే రహదారిలోని వ్యవసాయ పొలాల్లో సంచరిస్తున్న నెమలి విద్యుత్ షాక్‌తో మృతి చెందిందన్నారు. ఈ విషయాన్ని గుర్తించి ఫారెస్టు అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలానికి వచ్చిన ఫారెస్టు సిబ్బంది స్థానికులతో కలిసి పూడ్చివేసినట్లు వివరించారు.

## ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలి

ఇబ్రహీంపట్నంరూరల్, జనవరి 31 : కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో భాగంగా సంక్షేమ పథకాలు గ్రామీణ ప్రాంతాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ అందజేయాలని బీఆర్ఎస్వీ జిల్లా నాయకుడు మడుపు శివసాయి శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నేడు మాటమార్చి అర్హులైన వారికి అందించకుండా ఇబ్బందులకు గురిచేయటం సరైంది కాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందజేసే వరకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు.